అలరించిన నిర్విరామ సంగీతోత్సవాలు

పురస్కారగ్రహీతలతో దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పాలకుర్తి మధుసూదనరావు తదితరులు

ముషీరాబాద్, డిసెంబర్ 9: సుప్రసిరి ఆర్ట్స్ అసోసియేషన్ 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో సంగీత స్వరధార పేరిట 12 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన సంగీతోత్సవాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు పాల్గొని అలనాటి మహా నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, గాయకుడు ఘంటసాల మధుర గీతాలను ఆలపించి రంజింప చేశారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పాలకుర్తి మధుసూదనరావు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాలలో ఉత్తమ సేవలందిస్తున్న వారికి అక్కినేని, ఎన్టీఆర్, ఘంటసాల స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు, రామరాజు శ్రీనివాసరావు, సుప్రసిరి ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వీకే దుర్గ, కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం..

రవాణ శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌కు శనివారం తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

– చిక్కడపల్లి, డిసెంబర్ 9

కులగణనపై క్యాబినెట్ తీర్మానం చేయాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 9 : తెలంగాణలో కులగణనపై క్యాబినెట్ తీర్మానం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సమితి కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల కష్టాలను దూరం చేయడానికి బీసీలకు ప్రత్యేక మైన బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. కులగణన నిర్వహించడానికి క్యాబినెట్‌లో తీర్మానం చేసి బీహార్ రాష్ట్రం వలే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకకు 42 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ ఫెడరేషన్లు కార్పొరేషన్లకు పాలకమండలిలను ఏర్పాటు చేసి బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సమితి గ్రేటర్ హైదరాబాద మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి, కన్వీనర్ మారేపల్లి లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి గోశిక స్వప్న, బీసీ నాయకురాలు మట్ట జయంతి, దుర్గేశ్, శ్రీలత, బైద్యనాథ్, నర్సింహులు యాదవ్, అనికేత్, కామిశెట్టి కృష్ణ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కవాడిగూడ, డిసెంబర్9: ముదిరాజ్ ముషీరాబాద్ నియోజకవర్గం సంఘం చైర్మన్ డి. శివముదిరాజ్ ఆధ్వర్యంలో బోలక్‌పూర్ దేవుని తోటలోని భవాని శంకర ఆలయం ప్రాంగణంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. సంఘం చైర్మన్ డి.శివముదిరాజ్, అధ్యక్షుడు సదా, కమిటీ నాయకులు కృష్ణ, నాగరాజు, కిట్టూ, కేశవ్, గిరి, వెంకటేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో మహాలక్ష్మి పథకం ప్రారంభం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని(మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం)శనివారం కాచిగూడ బస్ టెర్మినల్‌లో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పీవీ సుధ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తెలంగాణ మహిళలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బర్కత్‌పుర బస్ డిపో మేనేజర్ వేణుగోపాల్, సీఐ విజయ్, శ్యామ్ పాల్గొన్నారు.

– కాచిగూడ, డిసెంబర్ 9

పోస్టర్ ఆవిష్కరణ..

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 9 : అకాడమీ ఆఫ్ ఇండియన్ డాన్సెస్ 39 వార్షికోత్సవాన్ని సోమవారం సా యంత్రం తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు మాధవీమాల, డైరెక్టర్ నిష్టల సుధామల తెలిపారు. నృత్యోపాసన శీర్షికను నిర్వహించే ఈ నృత్యకా ర్యక్రమంలో దాదపు 45 మంది యువ కళాకారులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం చిక్కడపల్లిలోని నృత్యమాల కార్యాలయం లో రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి. వసుంధర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కావ్యచంద్రిక, శృతి వారణాసి తదితరులు పాల్గొన్నారు.

25న విద్యార్థులకు మెరిట్ అవార్డులు..

కాచిగూడ,డిసెంబర్ 9 : ఈ నెల 25వ తేదీన మున్నూరుకాపు పేద విద్యార్థులకు కాచిగూడ సంఘంలో మెరిట్ అవార్డులను అందజేయనున్నట్లు మున్నూరుకాపు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్ రావు తెలిపారు. శనివారం కాచిగూడ కార్యాలయంలో మాట్లాడుతూ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డుకు నూతనంగా ఎలగందల దేవేందర్,అమరం చంద్రశేఖర్, ఆకుల నాగేశ్ మరో ముగ్గురు ట్రస్ట్ సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు, దడువై రాఘవేందర్‌రావు, మంద సూర్యప్రకాశ్, వి. పాండు రంగరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, డిసెంబర్ 9: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(45)శుక్రవారం రాత్రి ఉప్పుగూడ–యాకుత్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతు ని ఒంటిపై మెరూన్ రంగు చొక్క, నీలి రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.5 ఉన్నటు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.